


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -161-

**(16 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఇష్టం అనేది ప్రతి వ్యక్తికీ,** స్వతంత్ర భావనగా రూపొందుతుంది.

ఎవరి యిష్టం వారిది. వారి ఇష్టం ఇంకొకరికి కష్టంగా వుండవచ్చు. అంతమాత్రం చేత వారు మార్చుకోవలసిన అవసరం ఎంతమాత్రం వుండదు. ఇష్టాల కోసం మొండి పట్టుదలలు పట్టడం, ఇతరుల ఊహల్ని చెరిపి పారెయ్యడం సామాన్యంగా జరుగుతూ ఉంటుంది. “ఇంత సాహసమేమిటి?” అని ప్రశ్నిస్తే.. “అవును నా యిష్టం” అనేదే జవాబు.

ఈ ఇష్టాలను గురించిన అనేక విచిత్రాలున్నాయి. అవును మరి  ఇష్టాలకు ఒక రూపమేమిటి, ఒక భావమేమిటి, ఒక పద్ధతేమిటి, ఇష్టం అనే లైసెన్స్ ద్వారా ఏ పిచ్చిపని అయినా చెయ్యవచ్చు. ఏ వెర్రి సిద్ధాంతమైనా లేవదియ్యవచ్చు. కాదనేవారెవరు? అంటే మాత్రం అవతలవాళ్ళకు లెక్కా వంద ఎకరాల ఇనాం వ్రాసి యిచ్చినా కష్టాలు మార్చుకోలేనివాళ్ళు చాలామంది వుంటారు.

ఈ మధ్య ఎవరింటికో వెళ్ళాను ఆ ఇంట్లో యాభై ఏళ్ళ ఆమె పరుపు వేసుకుని క్రింద పడుకుంది. తలమాత్రం ప్రక్కనే వున్న ఒక మంచం క్రింద పెట్టింది. అదేమిటి ఆమెగారు అలా పడుకున్నారు అని ప్రశ్నించాను.

వాళ్ళ వాళ్ళు చెప్పారు ‘ఆమెకు అలా పడుకోవడమంటే ఇష్టం. మనమేం చేస్తాం?’ అన్నారు.

ఆమె యిష్టం ప్రకారం పరుపు ప్రక్కన ఒక మంచం వుండాలి. దాని క్రింద ఆమె తల వుండాలి అలా వుంటేనే నిద్రపడుతుందిట. పొరుగూరు వెళ్ళిన అలాటి ఏర్పాట్లు చేసుకుంటుందిట. ఆమె ఇష్టంలో గల హాయి ఆమె అనుభవిస్తోంది.

భోజనాల దగ్గరకొస్తే రకరకాల యిష్టాలు వుంటాయి. చాలామందికి పప్పులో ఆవకాయ కలుపుకోవడం యిష్టం. కొందరికి ఆవకాయలో పప్పు నంజుకోవడం యిష్టం. మా బంధువుల్లో కొందరికి ప్రతి ముద్దలో గుప్పెడు పంచదార కలుపుకోవడం యిష్టం.

చివరకు వడియాలు అన్నంలో పెట్టుకు తింటున్నా పంచదార వుండవలసిందే. తియ్యటి మజ్జిగలో గుప్పెడు చక్కెర వేస్తేగాని ముద్ద నోట పెట్టరు. “ఒక పాల గొట్టాం, పంచదార ఉడికే అన్నంలో పోస్తే పోదా?” అన్నానొకసారి.

"అబ్బే అలా ఏం బాగుంటుంది. తినేటప్పుడు పైన జల్లుకోవలసిందే. అప్పుడుగాని ఆ రుచి రాదు. మా ఇంట్లో అందరికీ ఇదే ఇష్టం. మూడు తరాల్నించి వస్తోందిట" అన్నారు. ఇంట్లో అందరికీ ఒకే రకం యిష్టం వుండటం కొంత మంచిదేననిపించింది.

ఇంట్లో పెద్దకొడుక్కి అరటికాయ పులుసు పెడితే యిష్టం. రెండో వాడికి కరకర వేగిస్తే యిష్టం. కూతురికి పప్పేసి వండితే కొండంత సంతోషం. పాపమా తల్లి మురుసుకుంటూ మూడు రకాలూ చేస్తుంది. విన్నవాళ్ళకు మాత్రం ఇష్టంలేకున్న వాళ్ళ విస్తళ్ళు అలా వదిలేసి, కొన్నాళ్ళు వూరుకోవడం మంచిదనిపిస్తుంది. లేకపోతే ఏమి ఇష్టాలివి? చేస్తున్న వాళ్ళను చంపుకుని తినే యిష్టాలు? మజ్జిగ నీళ్ళతో ఒక మండలం రోజులు తినిపిస్తే అన్ని పదార్థాలమీదా ఆసక్తీ, రుచి పుట్టుకు వస్తాయి. సాగుతుంటే చాలా ఇష్టాలు బయలుదేరుతూ వుంటాయి. వాటిని అరికట్టకపోతే ప్రతిపూటా రొస్టే.

"అదేమిట్రా! ఆ గొట్టాం లాగులు వేసుకు తిరుగుతున్నావు. మన సాంప్రదాయాలు మరిచిపోతున్నావేమిట్రా నీకు పుణ్యం వుంటుంది. పోనీ, మామూలు లాగూలు తొడుక్కోరా?" అని పెద్దవాళ్ళు అంటే

వెంటనే ఆ కుర్రవాడు అంటాడు "అవంటే నాకిష్టం. వాటిని వదలమంటారేమిటి? ఇష్టంలేని పనులు ఎవడన్నా చేస్తాడా? మన సాంప్రదాయాలంటే నాకిష్టంలేదు. నాకేమిటి? మా క్లాసులో చాలామందికి ఇష్టంలేదు. వాళ్ళ పెద్దవాళ్ళంతా వూరుకోవడంలా! మీరే నన్నిట్లా చంపుతున్నారు. నేనీ లాగూలు తప్ప మరో రకం తొడగను. కావాలంటే ఇంట్లోనుంచి వెళ్ళిపోతా. అసలు విషయం ఏమిటంటే మీకు ఇష్టంలేదు."

వేరేవాళ్ళ నెత్తిన గట్టి గట్టి కంకర రాళ్ళు విసిరి, బెదిరించి నీ యిష్టం వచ్చినట్లు చెయ్యిరా బాబూ మేం నోరు ఎత్తం అనిపించి మరీ వదులుతాడు.

"జుట్టు అలా పైకి తోసి కుప్పల్లే పెడతావేరా తండ్రీ. కొంచెం ప్రక్కకు దువ్వుకోరా. నుదురు కాస్త బయట పడుతుంది. దాన్ని అలా మూసేస్తావేరా నా కన్నబాబూ" అని పెద్దవాళ్ళంటే

"నా యిష్టం నేనలాగే దువ్వుకుంటా. నా జుట్టుకి మీ యిష్టమేమిటి?" అంటాడు కుర్రవాడు.

"నీ యిష్టమేమిట్రా? నెత్తిన ఆ వుండలేమిట్రా?"

"మీకు ఉండలల్లే కనపడుతున్నాయి గావున్ను. ఊళ్ళో అందరూ అలాగే పెట్టుకుంటున్నారు. నాకొక్కడికే తిట్లు. జుట్టు మీదో, నిక్కర్ల మీదో వంకపెట్టి తిట్టిపొయ్యడం మొదలు పెట్టారు. నేనంటే మీకసలు యిష్టంలేదు " అని వాఙ్మూలం ఇస్తాడా వంశోద్ధారకుడు.

"సాయంత్రం పూట చీకటి పడకముందే కొంచెం ఇంటికి వస్తూ వుండరా నాన్నా. నీకోసం ఎదురుచూడలేక కళ్ళు చిల్లులు పడిపోతున్నాయి. చీకటి పడకపూర్వం విద్యార్థి యింటికి రావడంలో కొంత మేలుందిరా. అలా అభ్యాసం చేసుకోరా చిట్టి తండ్రీ. నిన్ను గడ్డం పట్టుకుని బ్రతిమాలుతున్నారా" అని పెద్దవాళ్ళ అభ్యర్థన.

“నా గడ్డం మీరేం పుచ్చుకోనక్కర్లా. నన్నేం బ్రతిమాలక్కర్లా. చీకటి పడక ముందే వద్దామనుకుంటున్నా. మాష్టరుగారు ఏదో పని చెపుతున్నారు. చేస్తూంటే చీకటి పడుతోంది. దానికి నన్నేం చెయ్యమంటారు. ఏ స్నేహితుడితోనో మాట్లాడుతుంటే చీకటి పడుతోంది. దానికి నన్నేం చెయ్యమంటారు?” అని ఎదురు ప్రశ్న.

"చీకటి పడేముందు స్నేహితుడితో మాట్లాడటం దేనికి? ప్రొద్దుంటే మాట్లాడాలి. లేకపోతే రేపు కలుసుకుందామని చక్కా రావాలి” అని సలహా.

“అలా మాట్లాడుతుంటే మధ్యలో విడిచి రావడం నాకిష్టంలేదు. నాకు స్నేహితులంటే చాలా యిష్టం వాళ్ళను విడిచి రమ్మంటారేమిటి? మర్నాడు వాళ్ళ ముఖం చూడొద్దూ. ప్రొద్దు కూకితే మాత్రం ఏం భయం? ఇదేం అడవా? ఎడారా? ఊరంతా దీపాలుండే . జనం తిరుగుతూ వుండిరి. చీకటి వేళకి ఇంటికి చేరుకోమంటారేమిటి? నేనేం పిట్టనా? పిచుకనా?" అది సమాధానం.

ఈ ఇష్టాల తమాషాలు చాలా వున్నాయి. మరికొన్ని మరోసారి.

Post your comments